క్లుప్తంగా

మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి


కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆర్డీటీ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. శనివారం మండల కేంద్రంలో ర్యాలీ చేశారు. వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ సీఓ రామకృష్ణ , మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

హైవే నిర్మాణానికి ఆటంకం కలిగించొద్దు

రాయదుర్గం(డి హీరేహాళ్): డీహీరేహాళ్ మండల కేంద్రంలో బళ్లారి–బెంగళూరు జాతీయ మార్గం మధ్యలో కిలోమీటరు దారి నిర్మాణానికి ప్రజలంతా సహకరించాలని డీఎస్పీ రవిబాబు కోరారు. శనివారం ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తో కలసి భూనిర్వాసితులతో ఆయన మాట్లాడారు. గతంలో పరిహారం అందుకున్న వారంతా ఇళ్లు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా వదిలి వెళ్లాలన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ కూడా రోడ్ కట్టింగ్‌లో పోతుందన్నారు. పోలీస్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఇందుకు తహసీల్దార్ అనిల్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు


నేమకల్లు ఆలయం వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న డీఎస్పీ రవిబాబు


బొమ్మనహాళ్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా సరే వదిలి పెట్టేదిలేదని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు హెచ్చరించారు. శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా నేమకల్లు, మురడి ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి ఆలయాల్లో డి.హీరేహాళ్ ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నేమకల్లులో డీఎస్పీ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలంతా దాయాదుల్లా కలిసి మెలసి ఉండాలన్నారు. ప్రతి చిన్న విషయానికి ఘర్షణలు పెట్టుకొని, కేసుల్లో ఇరుక్కోవడం మంచిది కాదన్నారు. సరిహద్దు గ్రామాల్లో పోలీస్ నిఘా పెంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ హనుమంతరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న జేపీసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి

కళ్యాణదుర్గం రూరల్: ఎస్సీ,ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జేపీసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏళ్ల తరబడి ఎస్సీ,ఎస్టీల సమస్యల అర్జీలకే పరిమితమయ్యాయన్నారు. భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిని పట్టించుకునేవారులేరన్నారు. ప్రభుత్వం మారినా ఎస్సీ,ఎస్టీలపైన దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే ఎస్సీ,ఎస్టీ జేపీసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జేపీసీ తాలూకా ఇన్‌చార్జ్ చెలిమప్ప, నాయకులు పాలొన్నారు.

నాగుల పుట్టకు ప్రత్యేక పూజలు


ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో ఉన్న పుట్టకు పాలు పోస్తున్న మహిళలు

కూడేరు: మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ మాసం మూడో శనివారాన్ని పురస్కరించుకొని గ్రామాల్లోని నాగుల కట్టలు, నాగుల పుట్టలకు ప్రత్యేక పూజలు చేశారు. కమ్మూరు, కూడేరు, ఇప్పేరు, ముద్దలాపురం, చోళసముద్రం, కొర్రకోడు, కరుట్లపల్లి, ఉదిరిపికొండ, శివరాంపేట, జల్లిపల్లి, గొటుకూరు, మరుట్ల గ్రామాల్లో పూజలు చేశారు.



మహిళా వైద్యులకు భద్రత,భరోసా కల్పించాలి

మహిళా డాక్టర్ల భద్రతకు భరోసా కల్పించాలి. ప్రశాంత వాతావరణంలో వారు విధులు నిర్వర్తించేలా చూడాలి. వైద్యులపై దాడులు అరికట్టేందుకు చట్టాలను కఠినతరం చేయాలి. కోల్‌కతా ఘటనలో నిందితులకు కఠిన శిక్ష విధించేలా ప్రభుత్వాలు చూడాలి. ఆస్పత్రుల్లో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించాలి. రోగి ఎంతటి బాధలో ఉన్నా వైద్యుడిని చూడగానే వారిలో ధైర్యం వస్తుంది. అలాంటిది ప్రాణం పోసే వారికే రక్షణ లేకుంటే ఇక సమాజంలో మనుగడ సాధించడం కష్టం.

శ్రావణ్‌కుమార్,
మెడికల్ ఆఫీసర్, డి.హీరేహాళ్



సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టు అమలు చేయాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఉదంతం మమ్మల్ని తీవ్రంగా కలిచి వేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మన రాష్ట్రంలో మహిళా వైద్యుల కోసం ఆస్పత్రి వద్ద పోలీసులతో రక్షణతోపాటు అన్ని రకాల వసతులను కల్పించాలి. డ్రస్సింగ్ రూమ్, రెస్ట్ రూములను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టును వెంటనే అమలు చేయాలి. మహిళా వైద్య సిబ్బందికి ధైర్యాన్ని కల్పించాలి.

మల్లేశ్వరి, వైద్యాధికారిణి,
బొమ్మనహాళ్ పీహెచ్‌సీ

ఎక్కడి చెత్త అక్కడే

- తడి,పొడి చెత్త సేకరణకు ఆటంకం
- నిలిచిపోయిన ఈ- ఆటోలు
- పట్టించుకోని అధికారులు


పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

రాయదుర్గం: రాయదుర్గంలో అపరిశుభ్రత నెలకొంది. ఘన వ్యర్థాల నిర్వహణకు విఘాతం ఏర్పడుతోంది. తడి, పొడి చెత్త వేరుగా సేకరించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏపీని క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటింటా చెత్త సేకరించేందుకు ఈ ఆటోలు అందుబాటులోకి తెచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక వాటి నిర్వహణ గాలికొదిలేసింది. ఫలితంగా అపరిశుభ్రత తాండవిస్తోంది.

రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలోని ప్రస్తుతం 12 వాహనాలపై వ్యర్థాల సేకరణ కొనసాగుతుంది. వీటిలో నాలుగు ట్రాక్టర్లు, ఐదు ఆటోలు, రెండు ఈ- ఆటోలు, కాంప్రేజర్ ఒకటి ఉంది. గత ప్రభుత్వంలో 14వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.38 లక్షలు ఖర్చుచేసి 9 ఈ-ఆటోలు కొనుగోలు చేశారు. దీంతో మొత్తం 19 వాహనాల్లో తడి, పొడి చెత్తను విడిగా సేకరించేవారు. తొమ్మిదిలో ఏడు ఈ-ఆటోలు మరమ్మతుకు గురయ్యాయి. రెండు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో చెత్త తరలింపునకు 12 వాహనాలే దిక్కయ్యాయి. దీంతో ఇంటింటా చెత్త సేకరణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది ఇళ్ల నుంచి చెత్తను సేకరించి, పుష్‌కార్టుల ద్వారా తరలించి డంపర్ బిన్లలో వేస్తున్నారు. దీంతో తడి, పొడి చెత్త కలిసిపోతోంది. ఇది ఇలాగే కొనసాగితే స్వచ్ఛతకు భంగం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది.గత ప్రభుత్వంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమం సక్రమంగా నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ మూడు డస్ట్‌బిన్లను అందించి, వాటి ద్వారా తడి, పొడి, ప్రమాదకర చెత్తను విడిగా సేకరించేలా ప్రణాళికలు చేపట్టారు. చెత్తను విడదీసి ఇవ్వకపోతే తీసుకునేది లేదంటూ లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. ప్రస్తుతం అలాంటిదేమీ కనిపించలేదు. ఫలితంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకపోలేదు.


మున్సిపల్ కార్యాలయంలో నిలిచిపోయిన ఈ-ఆటోలు

రోజుకు 27 టన్నుల చెత్త ఉత్పత్తి

పురపాలక సంఘంలో 32 వార్డులు 75 వేల జనాభా ఉంది. మొత్తం 18 వార్డు సచివాలయాల పరిధిలో నిత్యం 27 టన్నుల చెత్త (ఉత్పత్తి) సేకరణ జరుగుతోంది. ఇందులో 114 మంది కార్మికులు విధుల్లో పాల్గొంటున్నారు. చెత్తనుంచి సంపద సృష్టించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ ద్వారా ఈ-ఆటోలు కొనుగోలు, తడి, పొడిచెత్త ప్రోసింగ్ యార్డులు నెలకొల్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలసి పర్యావరణానికి ముప్పువాటిల్లకుండా జాగ్రత్త వహించారు. ప్రస్తుతం వాహనాలు ఆగిపోవడంతో వీధుల్లో చెత్త దర్శనమిస్తోంది. వీటి డ్రైవర్లకు వేతన బకాయిలు చెల్లించలేదు.

మరమ్మతులకు ప్రతిపాదనలు



ఈ-ఆటోలు గతంలో ఓ ఏజెన్సీ ద్వారా నడిచేవి. ప్రస్తుతం ఏజెన్సీ యాక్టివ్‌గా లేదు. ఆ బాధ్యత మున్సిపాలిటీలే చూడాల్సి వస్తోంది. తొమ్మిది ఆటోల్లో ఏడు మరమ్మతులు గురై కార్యాలయంలోనే మూలకు చేరాయి. వాటి మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాగానే వినియోగంలోకి తీసుకొస్తాం. ప్రస్తుతం ఉన్న వాహనాలతోనే ఇబ్బందులు లేకుండా చెత్త తరలింపు చేపడుతున్నాం.

– కిశోర్, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

పారిశుధ్యం, వాహనాల వివరాలు

75 వేలు	పట్టణ జనాభా
32	మొత్తం వార్డులు
18	వార్డు సచివాలయాలు
27	రోజూ చెత్త ఉత్పత్తి (టన్నుల్లో)
114	పారిశుధ్య కార్మికులు
12	చెత్త తరలింపు వాహనాలు
20	తడి, పొడి మిశ్రమంతో తరలిస్తున్న చెత్త అంచనా (టన్నుల్లో)

నేడు 'ప్రజావేదిక'

కణేకల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ సుధాకర్ తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 3 వరకు గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ.9 కోట్ల పనులు చేపట్టినట్లు వారు తెలిపారు.

శుభకార్యం


కూడేరు: నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: కరుట్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతిశంకరయ్య కుమారుడు విశ్వనాథ్ వివాహం కౌసల్యతో శనివారం కరుట్లపల్లి రామాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అశ్విని, సర్పంచ్ ఓబుళమ్మ, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, పార్టీ నేతలు మంజునాథ్ రెడ్డి , శౌరిరెడ్డి అక్కులన్న, నాగిరెడ్డి పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా కల్వర్టు


కూలడానికి సిద్ధంగా ఉన్న కల్వర్టు

కుందుర్పి: మండలంలోని కొలిమిపాళ్యం–కర్ణాటక పావగడ ప్రధాన రహదారిలో కొలిమిపాళ్యం వద్ద నాసిరకంగా నిర్మించిన మోరీ కూలడానికి సిద్ధంగా ఉందని జంబుగుంపల ప్రజలు తెలిపారు. ప్రధాన రహదారిపై కల్వర్టు నాసిరకంగా నిర్మించడంతో 90 శాతం దెబ్బతినిందన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు మేరకు వర్గీకరణ అమలు చేయాలి

కూడేరు: సుప్రీంకోర్టు తీర్పు మేరకు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీవర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు సామ్రాట్ మధు, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న డిమాండ్ చేశారు. శనివారం వారు కూడేరులో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ గత 30 ఏళ్లుగా పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, మహిళా అధ్యక్షురాలు స్వతంత్ర కుమారి, మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వ్యాపారాలు నిర్వహించొద్దు


క్లాక్‌టవర్ వద్ద వ్యాపారులతో మాట్లాడుతున్న ఈఓ, పోలీసులు

ఉరవకొండ: తోపుడుబండ్ల వ్యాపారులు రోడ్లపై వ్యాపారాలు చేయొద్దని మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్, పోలీసు సిబ్బంది శనివారం చిరు వ్యాపారులకు సూచించారు. ఈఓ మాట్లాడుతూ క్లాక్‌టవర్ వద్ద ప్రధాన రహదారిపై ఇష్టారాజ్యంగా తొపుడుబండ్లు, గంపల వ్యాపారులతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు క్లాక్‌టవర్ సమీపంలో రోడ్డుకడ్డంగా వాహనాలు నిలపరాదన్నారు. నిబంధనలను అతిక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం


రాయదుర్గంలో పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


అలంకరణలో బూదిగుమ్మ ఆంజనేయస్వామి

రాయదుర్గంటౌన్: మండలంలోని మల్లాపురంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసం మూడో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామిజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీసమేత స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ఆకులపూజ, నైవేద్య పూజలు జరిపించారు. అనంతరం పూలతో అలంకరించిన పల్లకీలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని అధిష్టించి, మేళతాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బీఎస్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న, కోశాధికారులు నరసింహులు, సత్యనారాయణ, కార్యదర్శి గురు రాఘవేంద్ర, సభ్యులు గురునాథరెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొణతిమ్మప్ప స్వామికి ప్రత్యేక పూజలు

బ్రహ్మసముద్రం : మండంలోని బొమ్మగానీపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలోని కొండపై వెలసిన దొణతిమ్మరాయ స్వామికి శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కొండ ప్రాంగణం అంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచి స్వామికి అభిషేకం, ఆకుపూజలు చేపట్టి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆంధ్ర కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

బెళుగుప్ప: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణమాస పూజల్లో భాగంగా రమనేపల్లి, బెళుగుప్ప, దుద్దేకుంట, బెళుగుప్ప, బూదిగుమ్మ శ్రీపద్మావతి వెంకటరమణస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం ఉదయం నుంచి సుప్రభాత సేవ, గంగస్నానం, మంత్ర పుష్పం, పంచామృతాభిషేకాలు, పుష్పాలంకరణ పూజలను నిర్వహించారు.


అలంకరణలో జనార్దన వెంకటేశ్వరస్వామి


అలంకరణలో దొణ తిమ్మరాయ స్వామి

సీతారామస్వామి ఆలయంలో విశేషపూజలు

వజ్రకరూరు: స్థానిక బలిజవీధిలోని సీతారామస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగదేవతకు ప్రత్యేక పూజలు

కణేకల్లు: కణేకల్లు చెరువుకట్టపై వెలసిన నాగులకట్ట వద్ద నాగదేవతకు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా భక్తులు నాగదేవతలకు పాలుపోసి పూజలు జరిపించారు. నాగుల కట్ట వద్ద భక్తులు పోటెత్తారు. అనంతరం ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి చెట్ల కింద వనభోజనాలు చేశారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి


మిడతల కరియప్ప విగ్రహానికి నివాళులర్పిస్తున్న గవిమఠం ఉత్తరాధికారి

ఉరవకొండ: ప్రతి ఒక్కరూ దైవచింతనను అలవర్చుకోవాలని, అప్పుడే మనసు ప్రశాంతంగా ఉంటుందని ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి తెలిపారు. శనివారం ఉరవకొండ దేవాంగ కళ్యాణ మండపంలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫంక్షన్ హాలులో నూతనంగా ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులను ఉత్తరాధికారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. దేవాంగ ఫంక్షన్ హాలుకు 69 సెంట్ల స్థలాన్ని దానం చేసిన మిడతల కరియప్ప విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులతో 26 ఏసీలు ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెంగల మహేష్, కమిటీ గౌరవాధ్యక్షులు మిడతల చంద్రమౌళి, సాధువెంకటస్వామి, నిమ్మల వెంకటరమణ, గోపాలం దత్తాత్రేయులు, ముక్కర బాలచంద్ర, అమరేష్, మల్లికార్జున, పోసా రామాంజి, గిద్దలూరు సూర్యనారాయణ, వెంకటేసులు, రామ్మూర్తి, కళ్యాణ మండపం మేనేజర్ చంద్ర పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పకడ్బందీగా చేయండి

- మైక్రో ఇరిగేషన్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఫిరోజ్‌ఖాన్


షేక్షానుపల్లిలో ఈపంట నమోదును పరిశీలిస్తున్న ఏపీడీ ఫిరోజ్‌ఖాన్

ఉరవకొండ: ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలని ఏపీ మైక్రో ఇరిగేషన్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ) ఫిరోజ్‌ఖాన్ సూచించారు. శనివారం మండలంలోని షేక్షానుపల్లి, కోనాపురం గ్రామాల్లో జరుగుతున్న ఈ –పంట నమోదు కార్యక్రమాన్ని ఏపీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏపీడీ మాట్లాడుతూ ఈపంట నమోదు చేయించుకోవడం వల్ల రైతులకు ఇన్సూరెన్స్, ఇన్‌పుడ్ సబ్సిడీ తదితరాలు వర్తిస్తాయన్నారు.రైతులు ఏదైతే పంట సాగుచేస్తున్నారో అదే పంటను నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బోరుబావులు కలిగిన రైతులు ప్రభుత్వ సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు సరఫరా చేస్తుందని, ఇందుకోసం రైతులు ఆర్‌ఎస్‌కేకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది చిక్కన్న, రైతులు రామాంజనేయులు, మల్లరాయుడు, నరేష్, చలపతి పాల్గొన్నారు.

బసాపురం అంజన్నకు పూజలు


ప్రత్యేక అలంకరణలో బసాపురం అంజన్న

కూడేరు: శ్రావణ మాసం మూడో శనివారాన్ని పురస్కరించుకొని కూడేరుకు సమీపంలో ఉన్న బసాపురం ఆంజనేయ స్వామి భక్తులతో పోటెత్తింది. జిల్లా నలమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. రామదుర్గం ఆంజనేయ స్వామి, కడదరకుంట, అంతరగంగ, పి.నారాయణపురం, కూడేరు ఆంజనేయ స్వామి ఆలయాల్లోనూ పూజలు నిర్వహించారు.

టీచర్లను బదిలీ చేయొద్దు


ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న మాయదార్లపల్లి గ్రామస్తులు

కుందుర్పి: మండలంలోని మాయదార్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను బదిలీ చేయొద్దని గ్రామస్తులు శనివారం మూకుమ్మడిగా పాఠశాలను బంద్ చేయించారు. అనంతరం ఎంఈఓ తిప్పేస్వామికి వినతి పత్రం అందించారు. తమ గ్రామం కర్ణాటక సరిహద్దున ఉందని, కొందరు రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు ఉపాధ్యాయులు వేరే చోటుకు బదిలీపై వెళుతున్నారన్నారు. బదిలీలను ఆపాలని గ్రామస్తులు ఈరన్న, వీరారెడ్డి, మంజు, నగేష్, తిమ్మప్ప తదితరులు కోరారు.

రేపు వాల్మీకుల బైక్ ర్యాలీ

అనంతపురం టవర్‌క్లాక్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి, బోయ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కేశవ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చారని తెలిపారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం బీసీలుగా చేర్చడం దారుణమన్నారు. వాల్మీకులు ఐక్యమత్యంగా ఉంటూ ఎస్టీ జాబితాలోకి చేర్చే వరకు పోరాడాలన్నారు. ఇందుకోసం ఈనెల 26న నగరంలో వాల్మీకులతో బైక్ ర్యాలీ నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే అదే రోజు వాల్మీకి కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 27న వాల్మీకి కళ్యాణ మండపంలో ఎస్టీ జాబితా చేర్చేందుకు కార్యాచరణ ఏర్పాటు చేస్తామన్నారు. వాల్మీకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్షుడు మాధవయ్య, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు కసుమ ప్రభాకర్, నాయకులు మేకల గోవిందు, నాగార్జున, అనిల్ కుమార్, సాకే మధు,తలారి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒక రోజులోనే వంద శాతం పూర్తి చేయాలి

కంబదూరు: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో సెప్టెంబర్ 1న పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఒక్క రోజులోనే వందశాతం పూర్తి చేయాలని మండల నోడల్ ఆఫీసర్ మద్దిలేటి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సచివాలయ, ఉపాధి హామీ, ఐసీడీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పింఛన్ల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామ సభల్లో అందజేసిన అర్జీల మేరకు ప్రణాళికలు సిద్ధం చేసి, వేగవంతంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. వీటితో పాటు పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను కూడా లబ్ధిదారులు పూర్తి చేసుకుంటే సకాలంలో బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. బిల్లుల చెల్లింపుల గురించి లబ్ధిదారులకు తెలియజేసి ఇళ్ల నిర్మాణాలు వేగంగా నిర్మించుకునేలా చూడాలని తెలియజేశారు. ఏఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

సీడ్స్ ప్రాసెసింగ్ కేంద్రం ప్రారంభం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని కళ్యాణదుర్గం రోడ్‌లోని శ్రీవినాయక సీడ్స్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. కేంద్రం నిర్వాహకులు మాజీ సహకార సంఘ అధ్యక్షుడు వెంకటనాయుడు, వెంకటేశులు, తగ్గుపర్తి సర్పంచ్ మౌనిక దంపతులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు, సభ్యులు, రైతులు, కార్మిక సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.